RNI NO. APTELL/ 2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 282 శనివారం 29 ఆగష్టు 2026 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ krk7018@gmail.com పేజీలు :4 రూ॥ 1/-

### ఆర్మూర్ లోని శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో రాఖీ పండుగ సందర్భంగా అన్నప్రసాద వితరణ

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో రాఖీ పండగ సందర్భంగా మహా అన్న ప్రసాదం కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు ముదిరాజ్ సంఘం పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి పౌర్ణమి నాడు భక్తులకు అన్నప్రసాదం వితరణ చేయడం ఆనవాయితీగా వస్తుంది ఈ కార్యక్రమం 8 నెలలుగా అన్నప్రసాద కార్యక్రమం జరుగుతుంది అని అన్నారు. దాతలు. జిన్నా సుమన్. అపూర్వ దంపతులు వారి ఆర్థిక సహకారంతో ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ కమిటీ సభ్యులు . మహా అన్న ప్రసాదాన్ని అందజేశారు

### రాఖీ పౌర్ణమి వేడుకల సందర్భంగా శ్రీ వాసవి కన్య కాపరమేశ్వరి దేవాలయంలో ఘనంగా యజ్ఞ కార్యక్రమం

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రారంభమైన ప్రత్యేక యజ్ఞం స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్మూర్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక యజ్ఞం కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది లోక కళ్యాణార్థం పట్టణ ప్రజల శ్రేయస్సును కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన ఈ పవిత్ర హోమం ఉదయం 8 లకు వేద పండితుల మంత్రోచ్ఛరణాలు శాస్త్ర విధి విధానాల మధ్య ఘనంగా మొదలైంది ఈ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు

## సీఎం రేవంత్ రెడ్డితో మంత్రి ఉత్తమ్ భేటీ.



సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. సెప్టెంబర్ 1న తుమ్మిడిహట్టిపై తెలంగాణ-మహారాష్ట్ర అధికారులతో జబౌజ సమావేశం కానుంది. దీంతో తుమ్మిడిహట్టి ఎత్తు, నిర్మాణంపై తెలంగాణ వాదనను బలంగా వినిపించడంపై సీఎం రేవంత్ ఉత్తమ్ చర్చించకోనున్నారు. తుమ్మిడిహట్టి అంశంపై ప్రధాని మోదీకి సీఎం రేవంత్ లేఖ నేపథ్యంలో కీలక సమావేశం ఏర్పడనున్నారు. మహారాష్ట్రతో తుమ్మిడిహట్టి అంతర్రాష్ట్ర సమస్యకు పరిష్కారం చూపే దిశగా తెలంగాణ వ్యూహాలు రచిస్తుంది. సెప్టెంబర్ 7న జబౌజ చైర్మన్ నేతృత్వంలో ఏపీ -తెలంగాణ జల వివాదాలపై కీలక భేటీ జరగనుంది. కృష్ణా జలాల వాటా, నీటి విడుదలపై ఏపీ--తెలంగాణ మధ్య వివాదం కొనసాగుతుంది. కృష్ణా ప్రాజెక్టుల నిర్వహణ, నీటి పంపకాలపై ఖ=వీదీ పరిధిలో పెండింగ్ అంశాలపై చర్చించనున్నారు. గోదావరి జలాల వినియోగం, ప్రాజెక్టులు-అనుమతులకు సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య ఉన్న వివాదాలపై చర్చించనున్నారు. అంతర్రాష్ట్ర జల వివాదాలు, సుప్రీంకోర్టు కేసుల పరిష్కారానికి తెలంగాణ తరపున అనుసరించాల్సిన వ్యూహంపై సీఎం రేవంత్ దిశానిర్దేశం చేయనున్నారు.

## యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవు: మంత్రి తుమ్మల




హైదరాబాద్:ఆగస్టు 28:(ఇందూర్‌నేత్రం విలేకరి) వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో పనిముట్లు ఖరారు చేశామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. యాంత్రీకరణ సబ్సిడీ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో ఈరోజు (శుక్రవారం) వ్యవసాయశాఖపై మంత్రి తుమ్మల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. ఎంప్యానెల్ సంస్థల జాబితాను హాకా అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు. యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని మంత్రి స్పష్టం చేశారు. ఫెర్టిలైజర్ యాప్ సమస్యలను.. అదే రోజే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్‌పై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

2లో

### ఢిల్లీలో మళ్లీ మొదలైన

# డీలిమిటేషన్ రగడ




దేశ రాజధాని ఢిల్లీ వేదికగా మళ్లీ డీలిమిటేషన్ రాజకీయం తీవ్ర రూపం దాల్చింది. వర్షాకాల సమావేశాలను ఆగస్టు 13న వాయిదా వేసినా.. ప్రొరోగ్ చేయలేదంటూ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద కలకలమే రేపాయి. ప్రభుత్వం ఏ క్షణంలోనైనా సభను మళ్లీ సమావేశపరిచి ప్రత్యేక బిల్లులు తెచ్చే అవకాశం ఉందన్న వార్తలు విపక్షాల్లో కాకరేపుతున్నాయి. ఈ ప్రచారం ఊపందుకోవడంతో ప్రధాని మోదీకి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేఖ రాశారు. దేశ భవిష్యత్తుపై ప్రభావం చూపే నియోజకవర్గాల పునర్విభజన లాంటి సున్నితమైన అంశంపై కేంద్రం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేశారు.

బుల్డోజర్ తరహా నిర్ణయాలను పునరావృతం చేయవద్దని హెచ్చరిస్తూ.. కాంగ్రెస్ తరఫున మూడు కీలక డిమాండ్లను ప్రధాని ముందుంచారు. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాల సంఖ్యను, రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని మార్చకుండా మరో 25 ఏళ్ల పాటు ఇలాగే కొనసాగించాలని ఖర్గే కోరారు. అలాగే డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా 2029 లోక్‌సభ ఎన్నికల నాటికే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. గతంలోనూ జులై 16న తాను రాసిన లేఖను గుర్తుచేసిన ఖర్గే.. తక్షణమే అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విపక్షాల డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనేది ఇప్పుడు తీవ్ర ఆసక్తికరంగా మారింది.

## నేపాల్ వరద విపత్తు

### 538కి చేరిన మృతుల సంఖ్య.. 85 మంది భారతీయులు సేఫ్!

నేపాల్ లో సంభవించిన భారీ వరదలు మహా విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ప్రకృతి విపత్తులో మరణించిన వారి సంఖ్య 538కి చేరినట్లు నేపాల్ డిజాస్టర్ అధికారికంగా ప్రకటించింది. మరో 977 మంది ఆచూకి గల్లంతయ్యిందని పేర్కొంది. ప్రస్తుతం వారి కోసం కోసం గాలిస్తున్నట్లు స్పష్టం చేసింది. మరోవైపు చైనాలో కూడా ఈ అకస్మిక వరదలు తీవ్ర ప్రభావాన్ని చూపింది. కనీసం ఐదుగురు మరణించినట్లు చైనా అధికారిక మీడియా ప్రకటించడంతో రెండు దేశాల్లో కలిపి మొత్తం మృతుల సంఖ్య 543కి చేరింది. ప్రస్తుతం రెండు దేశాల పరిధిలో కలిపి దాదాపు 1,500 మందికి పైగా గల్లంతైనట్లు అధికారులు భావిస్తున్నారు.

# బంగారం అన్వేషణ

బంగారం ఉత్పత్తిలోకి సింగరేణి.. రేవంత్ సర్కార్ బిగ్ ప్లాన్! ఆర్థిక భద్రతలో బంగారం కీలకం ఉత్పత్తి నుంచి శుద్ధి వరకు పరిశీలన..



2లో

## పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని భావిస్తున్న తెలంగాణ ప్రజలు: ఎంపీ ఈటల



2లో

# రాఖీ పండగ వేళ కిటకిటలాడుతున్న బస్టాండ్లు

- ప్రత్యేక బస్సులు ఉన్నా తగ్గని కష్టాలు

**- పెరిగిన చార్జీలతో ప్రయాణికుల ఇబ్బందులు**



రాఖీ పౌర్ణమి వేడుకల కోసం సోదరులకు రాఖీ కట్టేందుకు ఆడబిడ్డలు తమ సొంతూళ్లకు ప్రయాణం అయ్యారు. వరుస సెలవులు రావడంతో నగరంలో ఉండే ఉద్యోగులు అలాగే ప్రజలు ఊళ్లకు బయలుదేరారు. దీనివల్ల జేబీఎస్, ఎంజీబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్ ప్రధాన బస్టాండ్లు అన్నీ కిటకిటలాడుతున్నాయి. బస్ స్టేషన్లలో ఎటు చూసినా ప్రయాణికుల రద్దీ భారీగా కనిపిస్తోంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీజీఎస్‌ఆర్టీసీ ఐదు వేల ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. అయితే రద్దీ ఎక్కువగా ఉండటంతో ఈ బస్సులు సరిపోవడం లేదు. దీనివల్ల ప్రజలు గంటల తరబడి బస్ స్టాండ్లలోనే వేచి చూడాల్సి వస్తోంది. సమయానికి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు నానా తంటాలు పడుతున్నారు. ప్రత్యేక బస్సుల్లో ముప్పై నుండి యాభై శాతం వరకు చార్జీలు పెంచేశారు. సాధారణ రోజులతో పోలిస్తే పండుగ వేళ అదనపు భారం పడుతుండటంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. చార్జీల మోత మోగుతున్నప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో సొంతూళ్లకు వెళ్లేందుకు జనం పయనమవుతున్నారు.

### కర్ణాటక రాజకీయాల్లో బిగ్ ట్విస్ట్..

## రూ.89 కోట్ల స్కామ్ సెగ

## కన్నీళ్లతో మంత్రి నాగేంద్ర రాజీనామా!



మహర్షి వాల్మీకి ఎస్టీ అభివృద్ధి సంస్థలో వెలుగుచూసిన రూ.89 కోట్ల అక్రమాల ఆరోపణలు కర్ణాటక రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. విపక్ష బీజేపీ నుంచి వస్తున్న ఒత్తిళ్లకు తలొగ్గి కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర ప్రణాళిక - సంఖ్యాశాఖ మంత్రి బి. నాగేంద్ర తన పదవికి రాజీనామా చేశారు. విలేకరుల సమావేశంలో తన రాజీనామాను ప్రకటిస్తూ ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనై కన్నీరు పెట్టుకున్నారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రివర్గం నుంచి ఆయన తప్పుకోవడం స్వల్ప వ్యవధిలోనే ఇది రెండోసారి కావడం గమనార్హం.

2లో

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక



## సంపాదకీయం

# ఆఖిరి వరకూ అభ్యుదయ ఉద్యమాలతోనే...


వల్లిపల్లి సుమతి...కృష్ణా జిల్లా కాటూరు గ్రామంలో పుట్టారు. తల్లి లక్ష్మీ తులసి, తండ్రి నాగభూషణం. అభ్యుదయ భావాలు కలిగిన కుటుంబం వీరిది. అంతేకాదు, ఆమె పుట్టిన కాటూరు అభ్యుదయ భావాలకు, మహిళా ఉద్యమానికి పుట్టినిల్లు. మానికొండ సూర్యావతి, రాజేశ్వరమ్మ, కడియాల బుల్లెమ్మ నాయకత్వంలో అప్పట్లో మహిళా ఉద్యమం నడిచేది. మూఢనమ్మకాలకు, ఛాందస భావాలకు వ్యతిరేకంగా మహిళల్లో, యువతలో పెద్ద ఎత్తున ప్రచారం చేసేవారు. అలాగే స్త్రీ విద్య, వితంతు పునర్వివాహాలు, కులం మతం పట్టింపులు లేని సమాజం కోసం అనేక ఉద్యమాలు అక్కడి నుండే జరిగేవి. అలాంటి చోట పుట్టి పెరగడం వల్ల సుమతిపై కూడా ఆ ప్రభావం పడింది.? సుమతి వాళ్లు ముగ్గురు అక్కచెల్లెళ్లు, నలుగురు అన్నదమ్ములు. ఆర్థికంగా అంతంత మాత్రమే. అయినప్పటికీ నాగభూషణం దంపతులు తమ పిల్లలను బాగా చదివించారు. ఆ రోజుల్లో 'ఆడపిల్లలకు చదువెందుకు?' అని అందరూ అనుకునేవారు. కానీ ఆయన తన ముగ్గురు ఆడపిల్లల్ని సాంకేతిక విద్యలో ప్రోత్సహించారు. అంతేకాదు, గ్రామంలోని మిగతా ఆడపిల్లలను కూడా చదివించమంటూ తల్లిదండ్రులను ప్రోత్సహించేవారు. ఇంట్లో సుమతినే పెద్ద కూతురు. ఆమె సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా చేసి, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సంపాదించింది. పి.మధును కులాంతర వివాహం చేసుకుంది. అప్పటికే మధు పార్టీలో పూర్తికాలం కార్యకర్తగా ఉన్నారు. తన చెల్లెళ్లను చదివించడంతో పాటు వాళ్లు కూడా కులాంతర వివాహాలు చేసుకునేలా ప్రోత్సహించిన ఆదర్శమూర్తి సుమతి. భర్త మధు పార్టీ పనుల్లో విరామం లేకుండా తిరుగుతుంటే ఉద్యోగం చేసుకుంటూనే కుటుంబాన్ని చూసుకునేది. అంతేకాదు... పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరు ఇంటికి వచ్చినా అందరికీ అన్నీ చేసి పెట్టేది. ఎంతో ప్రేమగా వారినీ తన కుటుంబ సభ్యులుగా ఆదరించేది. అలాగే సైన్స్ ఉద్యమం (జె.వి.వి)లో కూడా కీలక పాత్ర పోషించింది. కూతురు ప్రతిభకు పదేళ్లు వున్నప్పుడు ఆంధ్ర యూనివర్సిటీ నైట్ కాలేజీలో సివిల్ ఇంజనీరింగ్ (డిగ్రీ) సీటు వచ్చింది. కానీ పాప చదువుకోసం దాన్ని విరమించుకుంది.

కూతురు ప్రతిభ ఈరోజు డాక్టర్ అయ్యిందంటే అందులో సుమతి కృషి చాలా ఉంది. అంతేకాదు ఈ రోజు పి.మధు పార్టీలో ఓ నాయకుడిగా ఎదిగారంటే అందులో ఆమె పాత్ర చాలా కీలకం. తర్వాత ఉద్యోగానికి విఆర్‌ఎస్ తీసుకొని మహిళా ఉద్యమంలోకి వచ్చింది. అలాగే 'ప్రజాశక్తి'లో కొన్ని రోజులు అనువాదకురాలిగా చేసింది. బుక్‌హౌస్‌లో ఉంటూ అనేక పుస్తకాలను అనువదించింది. ఉమ్మడి రాష్ట్రంలో 'ఐద్వా' అభివృద్ధికి తన వంతు కృషి చేసింది. 2001లో 'ఐద్వా' అఖిల భారత 7వ మహాసభ విశాఖపట్నంలో జరిగింది. అప్పుడు ఓ సావనీర్ తీసుకొచ్చాం. ఆ సావనీర్ పనులన్నీ ఆమె దగ్గరుండి చూసుకుంది. వ్యాసాలు తెప్పించడం, తప్పులు లేకుండా చూడడం, ఫ్రీగా ప్రింటింగ్ వేయించడం ఇలా అన్ని పనులూ ఆమె చూసుకుంది.? 'మానవి' పత్రిక ప్రారంభించడంలో సుమతి కీలక పాత్ర పోషించింది. పత్రిక బోర్డు సభ్యురాలిగా ఉంటూ 'మానవి'కి కావాల్సిన వ్యాసాలు తెప్పించడం, రాయడం, దాన్ని బయటకు తీసుకురావడంలో ఎంతో కృషి చేసింది. అలాగే 'మోటూరు ఉదయం ట్రస్ట్' ప్రారంభంలో కూడా ఆమె కీలక పాత్ర పోషించింది. ట్రస్ట్ సభ్యురాలిగా కూడా ఉంది. 'ఐద్వా' రాష్ట్ర కార్యదర్శివర్గంలో ఉండేది. అప్పట్లో మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడ ప్రాంతంలో జోగిని వ్యవస్థ బాగా ఉండేది. చాలా మంది మహిళలు బలైపోతూ ఉండేవారు. అప్పట్లో ఇద్దరు పిల్లల తల్లి ఆకలికి తట్టుకోలేక చనిపోయింది. అప్పుడు నేనూ, సుమతి కలిసి ధన్వాడ వెళ్లి పక్కన ఉన్న మరో రెండు గ్రామాల్లో తిరిగి జోగినీల సమస్యలు తెలుసుకున్నాం. సుమతి అయితే వాళ్లతో మాట్లాడుతూ కన్నీళ్లు పెట్టుకుంది. వారికి పునరావాసం కల్పించాలని, పిల్లలకు చదువులు చెప్పించాలని కొన్ని డిమాండ్లతో జిల్లా కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం ఇచ్చాం.? రాష్ట్రం విడిపోయిన తర్వాత వారి కుటుంబం ఆంధ్రప్రదేశ్‌కు మారింది. గత కొన్నేళ్లుగా మహబూబ్‌నగర్‌లో డాక్టర్‌గా పని చేస్తున్న తన కూతురు ప్రతిభ దగ్గరే ఆమె ఉంటోంది. కదలలేని స్థితిలో ఉన్నా తనకు వచ్చే పెన్షన్ మొత్తం రెండు రాష్ట్రాల పార్టీ కమిటీలకు విరాళంగా ఇచ్చేది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'ఐద్వా' అఖిల భారత మహాసభకు కూడా రూ.30 వేలు విరాళం ఇచ్చింది. ఇదంతా ప్రజా ఉద్యమాలపై ఆమెకున్న ప్రేమకు నిదర్శనం. పార్టీ అన్నా, పార్టీలో పని చేసే పూర్తి కాలం కార్యకర్తలన్నా ఆమెకు ఎంతో ప్రేమ.?

నాకైతే వ్యక్తిగతంగా ఎన్నో సలహాలు ఇచ్చేది. పెళ్లి కాక ముందు నుండి నాకు సుమతక్కతో మంచి పరిచయం. మా సృజన పుట్టిన కొత్తలో ఉద్యమాన్ని, పాపని సమన్వయం చేసుకోలేక సతమతమవుతుంటే ఎలా నిర్వహించుకోవాలో సలహాలు ఇచ్చేది. అభ్యుదయ ఉద్యమాలు జరగడం ఓ భాగమైతే వాటి ప్రభావం మనుషులపై చాలా ఉంటుంది. అలా ప్రభావితమైన వ్యక్తి సుమతి. ఆ ప్రభావంతోనే రిటైర్ అయిన తర్వాత కూడా పార్టీకి తన వంతుగా సహకారం అందించింది. అప్పట్లో చిర్రావూరిగారినైతే నాన్న అంటూ ఆప్యాయంగా పిలిచేది. నండూరి ప్రసాదరావు అండర్‌గ్రౌండ్‌లో ఉన్నప్పుడు సుమతి దగ్గరే ఉండేవారు. ఎం.హెచ్ తో కూడా ఈమెకు మంచి అనుబంధం ఉండేది. నాయకులందరినీ తన కుటుంబ సభ్యులుగా చూసుకునేది. కుటుంబాల్లో ఉండే మహిళల తోడ్పాటు లేకుండా అభ్యుదయ ఉద్యమాలు కొనసాగించడం సాధ్యం కాదు. అలాంటి పాత్ర పోషించిన వారిలో సుమతి ఒకరు. చివరి రోజుల్లో తన తల్లిని ప్రతిభ కంటికి రెప్పలా చూసుకుంది.

# దళితుడిపై గోగూండాల దాడి.. ఆలస్యంగా వెలుగులోకి

## బలవంతంగా ఆవుపేడ తినిపించిన వైనం



ముంబయి : మహారాష్ట్రలోని జల్నాలో దళిత వ్యక్తిపై గోగూండాలు దాడికి పాల్పడి, బలవంతంగా ఆవుపేడ తినిపించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎద్దును కబేళాకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నారనే ఆరోపణతో బజరంగ్ దళ్ సభ్యులు పరమేశ్వర్ సుహాస్ హివాలేపై దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బాధితుడు ఈ నెల ఆగస్టు 21న పోలీసులను ఆశ్రయించారు. మే 23న ఈ ఘటన జరిగినప్పటికీ.. పోలీసులు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదు. వివరాల ప్రకారం.. పరమేశ్వర్ సుహాస్ దేవుల్‌గావ్ రాజాలో పశువుల సంతలో కొనుగోలు చేసిన ఎద్దును తీసుకుని 11 ఏళ్ల కుమారుడు, నారాయణ్ మారోతి కాంబ్లేతో కలిసి జల్నాకు తిరిగి వస్తున్నాడు. గోరక్షకులుగా పేర్కొంటూ బజరంగ్ దళ్ సభ్యులు కన్హయ్యనగర్ వద్ద వారి వాహనాన్ని అడ్డుకున్నారు. కొనుగోలుకు సంబంధించిన పత్రాలు చూపించినప్పటికీ పరమేశ్వర్ సుహాస్‌ను చెంపదెబ్బలు కొట్టి, పేరు, కులం అడిగి కులపరమైన దూషణలకు పాల్పడ్డారు. అనంతరం పరమేశ్వర్ నోటిలో బలవంతంగా ఆవుపేడ కుక్కారు. 11 ఏళ్ల కుమారుడికి కూడా ఆవు పేడ నోటిలో కుక్కేందుకు యత్నించారు. కాంబ్లేపై కూడా దాడి చేసి, వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటనను వీడియో తీసిన నిందితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆరుగురు నిందితులపై బిఎన్‌ఎస్‌లో ని పలు సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ (అత్యాచా రాల నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదు.

# బంగారం అన్వేషణ

బంగారం మైనింగ్‌లో విశేష అనుభవమున్న కర్ణాటక ప్రభుత్వ సంస్థ హట్టి గోల్డ్ మైన్స్‌తో సింగరేణి కలిసి పనిచేసేలా జాయింట్ వెంచర్ అవకాశాలను పరిశీలించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థల సాంకేతిక సామర్థ్యం, అనుభవాన్ని సమన్వయం చేస్తే దేశీయ బంగారం ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ?కర్ణాటక గోల్డ్ మైన్స్ ప్రాంతంలో రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాయచూర్ జిల్లాలోని హట్టి, యూటీ బంగారు గనులను ఉప ముఖ్యమంత్రి సందర్శించారు.

బంగారు ఖనిజం తవ్వకం నుంచి శుద్ధ బంగారం తయారీ వరకు చేపడుతున్న ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించారు. ?హట్టి గోల్డ్ మైన్స్‌కు బంగారం అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్, శుద్ధిలో అపార అనుభవం ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి తెలిపారు. బొగ్గు, ఇతర ఖనిజాల అన్వేషణ, తవ్వకాల్లో సింగరేణికి ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని హట్టి అనుభవంతో జోడించాలని సూచించారు. ?బంగారం అన్వేషణ, తవ్వకం, వెలికితీత, శుద్ధి, ఆధునిక సాంకేతికత వినియోగం, నిపుణుల సేవలు, మానవ వనరుల శిక్షణ తదితర అంశాల్లో రెండు సంస్థలు సంయుక్తంగా పనిచేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. దేశ ఆర్థిక భద్రతలో బంగారం కీలక పాత్ర పోషిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న బంగారు ఖనిజ వనరులను శాస్త్రీయంగా అన్వేషించి వెలికితీయడంలో సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుండాలన్నారు. ?బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హట్టి–సింగరేణి భాగస్వామ్యంతో బంగారం ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, స్థానిక ఉపాధి కల్పనతోపాటు దేశ ఆర్థికాభివృద్ధికి మేలు జరుగుతుందని తెలిపారు.హట్టి గోల్డ్ మైన్స్‌లోని ప్రొడక్షన్ యూనిట్, ఖనిజ శుద్ధి కేంద్రం, ఎలక్ట్రో విన్నింగ్ కేంద్రాలను ఉప ముఖ్యమంత్రి భట్టి పరిశీలించారు. గని నుంచి వెలికితీసిన ఖనిజాన్ని వివిధ దశల్లో ప్రాసెస్ చేసి శుద్ధ బంగారంగా మార్చే విధానాన్ని అధికారులు వివరించారు. హట్టి ప్రాజెక్టు ద్వారా రోజుకు

# పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని భావిస్తున్న తెలంగాణ ప్రజలు: ఎంపీ ఈటల

హైదరాబాద్:ఆగస్టు 28: తెలంగాణలో కేసీఆర్ పాలనలాగానే.. రేవంత్ రెడ్డి పాలన కూడా ఉందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనతో పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. శుక్రవారం తెలంగాణ సెక్రటేరియట్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఎంపీ ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. అనంతరం సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ఐదు కిలోల సన్న బియ్యం ప్రజలకు ఇస్తున్నా.. ప్రధాని మోదీ ఫోటో వేయడం లేదని మండిపడ్డారు. ఎవరి జాగీరని మీ ఫొటోలు వేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. యూఎస్, యూరప్ వెళ్లి.. భారత్‌లో మత కల్లోలాలు జరుగుతున్నాయని అంటారని విమర్శించారు. లుంబిని పార్క్, గోకుల్ చాట్ వద్ద ఎవరి హయాంలో బాంబులు పేలాయని కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.

# తెలుగు రాష్ట్రాల్లో ఉల్లి చక్కెర మంట.

## రూ. 70 తాకిన ఉల్లి.. చక్కెర రూ. 65 : వంటింట్లో కిరాణా బిల్లుల మంట

నిత్యావసరాల ధరలు మంటపుట్టిస్తున్నాయి. దీంతో తెలుగు రాష్ట్రాల్లో సగటు సామాన్యుడి నెలవారీ బడ్జెట్‌కు మళ్లీ పెద్ద కన్నం పడింది. పొద్దున్నే లేస్తే వంటింట్లో వాడే ఉల్లిపాయలు, చక్కెర ధరలు ఒక్కసారిగా కొండెక్కి కూర్చున్నాయి.

గత కొద్ది రోజులుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రిటైల్ మార్కెట్లలో ఉల్లి, పంచదార ధరలు విపరీతంగా పెరగడంతో రోజూవారీ కిరాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి ప్రధాన నగరాల్లో నాణ్యమైన ఉల్లి కిలో రూ. 65 నుంచి రూ. 70 వరకు పలుకుతున్నాయి. ఉల్లి ధరలు ఉన్నట్టుండి ఇంతలా పెరగడానికి ప్రధాన కారణం డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేకపోవడమే. మన దేశంలో ఉల్లికి హబ్ లాంటి మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతంలో ఈసారి ఖరీఫ్ పంట దిగుబడి 5 నుంచి 7 శాతం వరకు తగ్గింది. దీనికి తోడు రుతుపవనాల అస్థిరత, వర్షాలు సరిగా పడక విత్తనాలు ఆలస్యంగా వేయడంతో మార్కెట్‌కు రావాల్సిన కొత్త ఉల్లి సరుకు ఆలస్యమైంది. ప్రతి ఏటా రబీ పంట నిల్వలు అయిపోయి, కొత్త ఖరీఫ్ పంట పూర్తి స్థాయిలో మార్కెట్‌లోకి వచ్చే మధ్య కాలంలో ఈ గ్యాప్ ఏర్పడుతుంది. ప్రస్తుతం అదే గ్యాప్ వల్ల మార్కెట్లో సరుకు కొరత ఏర్పడి రేట్లు భారీగా పెరిగాయి. గతంలో కిలో 25 నుండి 35 మధ్య లభించిన ఉల్లిపాయల ధర ప్రస్తుతం 55 నుండి 70 వరకు చేరింది. అలాగే చక్కెర ధర కూడా గతంలో కిలో 45 నుండి 48 ఉండగా, ఇప్పుడు ?65 నుండి 70కి పెరిగింది. ఇక కందిపప్పు విషయానికి వస్తే, ధరలు స్థిరంగా పెరుగుతూ ప్రస్తుతం కిలో ?120 దాటి వినియోగదా రులపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. చక్కెర ఉత్పత్తి తగ్గిపోవడం, ఫెస్టివల్ సీజన్ ప్రారంభం కావడంతో దుకాణదారులు ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడంలో డిమాండ్ పెరిగింది. దానికి తగ్గట్టుగా సరఫరా లేదు. దీంతో చక్కెర ధరలు పెరుగుతున్నాయి. పెరుగుతున్న ఉల్లి ధరలకు బ్రేక్ వేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక కొత్త ప్లాన్ తో ముందుకు వచ్చింది. అదే 'కాందా ఎక్స్‌ప్రెస్'. మహారాష్ట్రలో ఉల్లిని 'కాందా' అని పిలుస్తారు.

నాసిక్ లోని బఫర్ స్టాక్ నిల్వలను త్వరగా, తక్కువ రవాణా ఖర్చుతో ఢిల్లీ, చెన్నై, కొచ్చి, గౌహతి వంటి ప్రధాన నగరాలకు చేరవేయడానికి ప్రత్యేక గూడ్స్ రైళ్లను ప్రారంభించారు. లారీలలో తీసుకెళ్లడం కంటే రైలు రవాణా వేగవంతంగా ఉండటమే కాకుండా రవాణా వ్యయం కూడా బాగా తగ్గుతుంది. దీనివల్ల వివిధ ప్రాంతాల్లో ఉల్లి కొరత తీరి, ధరలు అదుపులోకి వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా పలు ప్రాంతాల్లో NAFED, NCCF కేంద్రాల ద్వారా కిలో ఉల్లిని రూ. 35 రాయితీ ధరకే విక్రయించే ఏర్పాట్లు చేస్తున్నారని సమాచారం.

# యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవు: మంత్రి తుమ్మల

కాంప్లెక్స్ ఎరువులకూ సబ్సిడీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అన్నదాతలు యూరియాను అధికంగా వాడే పరిస్థితి మారాలని అన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో వేగం పెంచాలని ఆదేశించారు. రైతులకు 2 నుంచి 3 రోజుల్లోనే ఆయిల్‌పామ్ మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న జిల్లాలకు మొక్కల సరఫరాలో ప్రాధాన్యం కల్పించాలని మంత్రి అన్నారు. లక్ష్యానికి రెండింతల ఆయిల్‌పామ్ మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేయాలని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటును వేగవంతం చేయాలని ఆదేశించారు. 2600 రైతు వేదికలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. 2 నుంచి 3 నెలల్లో రైతు వేదికలపై సోలార్ పనులు పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిశానిర్దేశం చేశారు.

# నేపాల్ వరద విపత్తు

2015 తర్వాత అతిపెద్ద విపత్తు

2015లో సంభవించిన తీవ్ర భూకంపం తర్వాత నేపాల్‌ను ముంచెత్తిన అతిపెద్ద, దారుణమైన ప్రకృతి విపత్తు ఇదే కావడం గమనార్హం. హిమాలయ పర్వత ప్రాంతంలో ఉన్న గ్లేసియర్ (మంచు కొండ) ఒక్కసారిగా కూలిపోవడంతో సరస్సులోని నీరు, పైనున్న బండరాళ్లు ఒక్కసారిగా కింద వైపునకు దూసుకొచ్చాయి. ఈ కారణం చేతనే విపరీతమైన నష్టం జరిగినట్లు 'యుఎస్ జియోలాజికల్ సర్వే' స్పష్టం చేసింది.

3,742 మంది సురక్షితం

మరోవైపు వరద ప్రభావిత ప్రాంతాల్లో మూడో రోజు కూడా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బాధితులను కాపాడేందుకు నేపాల్ ప్రభుత్వం దాదాపు 14,000 మందికి పైగా భద్రతా బలగాలను రెస్క్యూ ఆపరేషన్‌లో మోహరించింది. ఇప్పటివరకు సుమారు 3,742 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వీరిలో 85 మంది భారతీయులు ఉండటం గమనార్హం. అయితే, ప్రతికూల వాతావరణం, రోడ్లన్నీ వరద ఉధృతికి కొట్టుకుపోవడం వల్ల గాలింపు చర్యలకు తీవ్ర విఘాతం కలుగుతోందని అధికారులు తెలిపారు.

# కన్నీళ్లతో మంత్రి నాగేంద్ర రాజీనామా!

రాజీనామా నేపథ్యం..

మే 2024లో వాల్మీకి కార్పొరేషన్ అకౌంట్స్ ఆఫీసర్ చంద్రశేఖరన్. పి ఆత్మహత్య చేసుకోవడంతో ఈ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. సంస్థ ఖాతాల నుంచి పెద్దమొత్తంలో నిధులు అక్రమంగా ఇతర ఖాతాలకు మళ్లాయంటూ ఆయన ఒక సూసైడ్ నోట్ రాసి ప్రాణాలు తీసుకున్నారు. దీనిపై వివాదం చెలరేగడంతో అప్పట్లో సిద్ధరామయ్య కేబినెట్‌లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న నాగేంద్ర.. 2024 జూన్ లో మొదటిసారి రాజీనామా చేశారు. ఆ తర్వాత సిద్ధరామయ్య స్థానంలో డి.కె. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆగస్టు మొదటి వారంలో నాగేంద్రకు మళ్లీ మంత్రివర్గంలో చోటు దక్కింది. అయితే ప్రతిపక్షాల ఆందోళనలు తీవ్రతరం కావడంతో నెల తిరక్కుండానే ఆయన మళ్లీ పదవిని వీడాల్సి

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
శనివారం
29 -08-2026

## పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జాన్కంపేట్ నరసింహా స్వామి ఆలయ చైర్మన్ కు ఘన సన్మానం.



ఎడపల్లి,ఆగస్టు 28: (ప్రజా గళం) ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలోని పద్మశాలి సంఘం 2 వ తర్ప వారి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయ నూతన చైర్మన్ గా ఎన్నికైన చిలుక రవికుమార్ తో పాటు,డైరెక్టర్ ఉడుత గంగాధర్ లను గురువారం శాలువ కప్పి ఘనంగా సన్మానం చేశారు.ఈ ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు నర్సయ్యా,కోట రాములు,దాకుల రాందాస్,రాంబాత్రి కిషన్,రాజు, భాస్కర్,ఓమ్ ప్రకాష్,ప్రవీణ్,అలాగే పద్మశాలి కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు, చైర్మన్ చిలుక రవికుమా ర్ కుల సంఘ సభ్యులకు ధన్యవాదములు తెలిపారు.

## నయాబాది జై హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యం లో ఘనంగా రక్షా బంధన్ వేడుకలు.

### రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపిన యువకులు.

ఎడపల్లి,ఆగస్టు 28: (ప్రజా గళం) నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని నయాబాదిలో గల జై హనుమాన్ ఆలయంలో శుక్రవా రం ఆలయ కమిటీ చైర్మన్ మీసాల రఘువేంద్ర ఆధ్వ ర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించా రు.అన్న తమ్ముళ్ల అనుబంధానికి,అక్క చెల్లెళ్ల అనుబం ధానికి ప్రతీకగా ఈ రక్షా బంధన్ పండగను జరుపుకుం టారని సర్పంచ్ కందగట్ల రాంచందర్ అన్నారు.హిందూ బంధువుల ఇంటిలో అన్న,తమ్ముళ్ల చేతికి అక్క చెల్లెళ్లు రాఖీలు కట్టడం జరుగుతుంది అని తెలిపారు. అన్నాతమ్ముళ్లు అక్క చెల్లెళ్లు కాళ్ళు మొక్కి వారి ఆశీస్సులు తీసుకోవడం జరుగుతుంది అని అన్నారు. దాంట్లో భాగంగా,ఆలయ కమిటీ చైర్మన్ రఘువేంద్ర ఆధ్వర్యంలో ఈరోజు హనుమాన్ ఆలయంలో యువ కులు అన్నదమ్ముళ్ల అనుబంధంగా ఒకరికొకరు రాఖీలు కట్టుకొని రాఖీ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి సర్పంచ్ కందగట్ల రామ చందర్ ఆలయ కమిటీ చైర్మన్ మీసాల రాఘవేంద్ర జన జాగృతి ఎడపల్లి కండ ప్రముఖ వీరేందర్,రాజు, నిశాంత్,శ్రీకాంత్,ఆర్.ఎల్లా గౌడ్ పలువురు కార్యకర్త లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నివాసం అంకాపూర్ లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు..



ఆర్మూర్ ఆగస్ట్ 28 (ప్రజా గళం) : ఆర్మూర్ డివిజన్ లోని అంకాపూర్ గ్రామంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నివాసంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోదరీమణులు మాధురి. శ్వేత ఆయనకు రాఖీ కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ తన కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన సోదరీమణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఆర్మూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రతి అక్క చెల్లెమ్మలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను సమాజంలో ప్రతి మహిళకు రక్షణగా నిలబడడమే రక్షాబంధన్ యొక్క అసలైన అంతరార్థం ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు స్థానిక ముఖ్య నాయకులు పాల్గొన్నారు ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు మరియు ప్రతి ఒక్కరికి సోదరీమణులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తెలిపారు.

## పి వి ఆర్ భవన్ లో వినయ్ కుమార్ రెడ్డిని కలిసిన ఆర్మూర్ మేర సంఘ జిల్లా నాయకులు..

ఆర్మూర్ ఆగస్ట్ 28 (ప్రజా గళం) ఆర్మూర్ నియోజకవర్గ లో మేరు కులస్తులకు సంబంధించిన పలు సమస్యలపై ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డిని గారిని కలిసి విన్నవించి వినతి పత్రం ఇచ్చి ఆ సమస్యలపై చర్చించిన జిల్లా మేరు సంఘం ఉపాధ్యక్షులు కొట్టూరు చంద్రకాంత్ గారు ఆర్మూర్ పట్టణ మేరు సంగం నాయకులు కొట్టు రూ ప్రవీణ్ రాజు గారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బీసీ మహిళల కోసం కుట్టు మిషన్లు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో మేరు కులస్తులు ఎక్కువగా కుట్టు మిషన్లపై జీవనాధారం సాగిస్తున్న సందర్భంగా మేరు కులస్తులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని విన్నవించడంతోపాటు ఆర్మూర్ నియోజకవర్గముకు సంబంధించిన మేరు కుల సంఘం భవన స్థలం మరియు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించిన జిల్లా మీరు సంఘం నాయకులు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డి గారిని శాలువాతో ఘనంగా సత్కరించిన మేరు సంఘ కుల నాయకులు. ఈ కార్యక్రమంలో వారితోపాటు నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాంరెడ్డి గారు ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబా గౌడ్ గారు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాగరాజు గౌడ్ గారు డిసిసి సెక్రెటరీ సాయినాథ్ గౌడు గారు కౌన్సిలర్లు నవీన్ గారు బొప్పెన ప్రసాద్ గారు మరియు ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అమరవీరులకు నివాళులు

-వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం


-సిపిఎం పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు జె.శంకర్ గౌడ్



నవీపేట్, ఆగస్టు 28( ప్రజాగళం) సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నవీపేట్ మండల కేంద్రంలో విద్యుత్ అమరవీరుల 28వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె. శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఆగస్టు 28 .2000 సంవత్సరంలో విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా నాటి చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు,సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ నుండి చలో సెక్రటేరియట్ వెళ్తున్న క్రమంలో బషీర్ భాగ్ వద్ద విచక్షణారహితంగా లాఠీఛార్జ్,బాష్ప వాయువులు వాటర్ కెన్లతో పాటు చివరకు కాల్పులు నిర్వహించడంతో ఇద్దరు సిపిఎం పార్టీ సభ్యులు బాలస్వామి,రామకృష్ణ,కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి ముగ్గురు చనిపోయరన్నారు. అప్పటినుండి ఇప్పటివరకు విద్యుత్తు చార్జీలు పెంచడానికి ఏ ప్రభుత్వం కూడా ముందుకు రావడానికి భయపడ్డాయాన్నారు. ఈరోజు విద్యుత్తు డిస్కాంట్లను ప్రైవేటు చేస్తూ కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఇటు రాష్ట్రంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు.అలాంటి కుట్రలను సిపిఎం పార్టీ ముందే గ్రహించి పోరాటాలకు సిద్ధంగా ఉంటుందని హెచ్చరించారు.కానీ ఈ స్మార్ట్ మీటర్లు పెట్టే విధానానికి వ్యతిరేకంగా పోరాటాల్లో జనాన్ని సమీకరిస్తామన్నారు. అమరవీరుల త్యాగానికి స్ఫూర్తిగా వారి ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లి పార్టీని ప్రజాసంఘాలను నిర్మించిన నాడే నిజమైన నివాళి అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నవీపేట మండల కార్యదర్శి నాయక్ వాడి శ్రీనివాస్. దేవేందర్ సింగ్. షేక్ మహబూబ్. జంగం గంగాధర్. సావిత్రి. షమీం. సుశీల గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# అధిక ధరలతో కొండెక్కి కూర్చున్న నిత్యవసరాల ధరలు

- అధికారుల నిర్లక్ష్యంతో నియంత్రణ లేని నిత్యావసరాల ధరలు
- 20 నుండి 30 శాతం ధరల పెరుగుదలతో జనం పరేషాన్
- చక్కెర చేదయింది, ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తుంది, మంచినీళ్లు నూనెలు ధరలు దిగనంటున్నాయి



హుస్నాబాద్ ఆగష్టు 28 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రాంతంలో నిత్యవసర సరుకుల ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో సామాన్య జనం, మధ్యతరగతి పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ధరల పెరుగుదలతో దీనికి తోడు చాలీచాలని జీతాలు ఉండడం, ప్రభుత్వాలు నిత్యవసరలలను కట్టడి చేయలేకపోవడం తో పేద కుటుంబాలు లబోదిబోమంటూ బేంబోలెత్తిపో తున్నారు. కూరగాయలు పప్పులు వంట నూనెలు చక్కర ఉల్లి వంటి నిత్యవసరాల ధరలు పెరుగుదలతో నిరుపేద కుటుంబాల నెలవారి బడ్జెట్ తారుమారవుతుంది. గతంలో ఖర్చు చేసిన మొత్తంలో ప్రస్తుతం అదే స్థాయిలో సరుకులు కొనలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మార్కెట్ కు వెళ్లిన ప్రతిసారి గతం కంటే ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుందని దీంతో పేద కుటుంబాలపై ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యవసర, కూరగాయల పాల ధరల పెరుగుదలతో ప్రజలు చుక్కలు చూస్తున్నారు.అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, కృత్రిమక్కువ సృష్టించడం అధిక ధరలకు విక్రయించడం వంటి వాటిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు పెద్ద ఎత్తున కోరుతున్నారు.

చక్కెర ధర చేదయింది,ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తుంది

ప్రస్తుతం మార్కెట్లో చక్కెర 20 రోజుల కింద 40నుండి 45 రూపాలు ఉన్న చక్కర ధరలు ఇప్పుడు 65 నుండి 70 రూపాయలకు ఎగబాకింది. దీంతో పేద ప్రజలకు చక్కెర తీపి కన్నా చేదువైపోయిందని వాపోతున్నారు. ఉల్లి ధర 20 నుంచి 30 రూపాయలు ఉండవలసిన దానికంటే 60 నుంచి 70 రూపాయలకు పెరగడంతో పేద కుటుంబాల ప్రజలలో ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తుందని ఉలిక్కి పడుతున్నారు. మంచినూనే ద్దరలు 150 రూపాయలు ఉన్న ధరలు 180 నుంచి 190 రూపాయల కు పెరిగినాయి. అల్లం ఎల్లిగడ్డ, పప్పులు లాంటి ప్రతి నిత్యవసర వస్తువులు ఈ 20 రోజులలో 20నుండి 30% ధరలు పెరిగినాయి.కూరగాయలు ఏది కొనాలన్న వంద నుంచి ఆపైన ధర పలుకుతున్నది. సామాన్య ప్రజల చేసిన రోజువారి కష్టం నిత్యవసరాల ధరలకే సరిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యవసరాల ధరలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రభుత్వం అధికారులు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతంలో నిత్యవసర వస్తువులు ఎంతవరకు అవసరం ఉంటాయి. కృత్రిమ కొరత సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు గోదాములు దుకాణాలలో తనిఖీలు నిర్వహించాలని, ధరలను నియంత్రించాలని సామాన్య ప్రజలకు ధరలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు పెద్దఎత్తున కోరుతున్నారు.

# ప్రభుత్వ విద్యను పటిష్ఠం చేయాలి

- కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి
- ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి
-నూతన విద్యా విధానం-- 2020తో విద్యారంగంలో ప్రైవేటీకరణకు ఊతం
- పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉచిత, నాణ్యమైన విద్య అందించాలి



మేడ్చల్: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంతోపాటు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు కఠినమైన ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని సీపీఎం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలను పరిష్కరించి పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

నూతన విద్యా విధానంతో ప్రైవేటీకరణకు అవకాశం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం--2020 విద్యారంగంలో పెనుమార్పులు తీసుకువస్తామని చెబుతున్నప్పటికీ, విద్యను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ వైపు నడిపించే విధంగా ఉందని పి.సత్యం విమర్శించారు. విద్యను కేంద్రీకరించడం, ఉన్నత విద్యలో ప్రైవేటు, విదేశీ పెట్టుబడులకు అవకాశాలను పెంచడం, పాఠశాలల విలీనాలు, మూసివేతలు వంటి చర్యలు పేద, మధ్యతరగతి, గ్రామీణ విద్యార్థులకు విద్యను దూరం చేసే ప్రమాదం ఉందన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, లౌకికత్వాన్ని కాపాడుతూ ప్రతి ఒక్కరికీ ఉచితంగా, నాణ్యమైన విద్య అందే విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని పి.సత్యం తెలిపారు. అనేక పాఠశాలల్లో సరిపడా తరగతి గదులు, మరుగుదొడ్లు లేవని, ఉపాధ్యాయుల ఖాళీలు పెద్ద సంఖ్యలో ఉన్నాయని పేర్కొన్నారు. ఉప్పల్లోని పాఠశాలలో డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్న పరిస్థితి ఉందని, కొన్ని ప్రాంతాల్లో జూనియర్, డిగ్రీ కళాశాలలు ఒకే భవనాల్లో షిఫ్ట్ పద్ధతిలో కొనసాగుతున్నాయని తెలిపారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థల విస్తరణ వేగంగా జరుగుతోందని ఆయన అన్నారు. జిల్లాలోని పాఠశాలల్లో సుమారు 85 శాతం ప్రైవేటు రంగంలో ఉండగా, కళాశాలల్లో సుమారు 95 శాతం ప్రైవేటు విద్యాసంస్థలేనని తెలిపారు. ప్రభుత్వం కొన్ని ప్రాంతాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల పేరుతో మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేసి ప్రచారానికే పరిమితం కాకుండా, అన్ని ప్రభుత్వ పాఠశాలలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉదయం 10.30 గంటలకు ప్రగతినగర్లోని పుచ్చలపల్లి లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న జిల్లా విద్యా సదస్సును జయప్రదం చేయాలని పి.సత్యం పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఫీజుల నియంత్రణ, విద్యార్థుల సమస్యలపై సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం బాచుపల్లి మండల కార్యదర్శి వెంకట రామయ్య, జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, బాచుపల్లి మండల కమిటీ సభ్యులు బాల వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, సీపీఎం నాయకులు నాగభూషణ్, బాల, స్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం...
ప్రజాగళం
తెలుగు దినపత్రిక



# సీఎం రేవంత్ రెడ్డికి బంగారు రాఖీ కట్టిన మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్:ఆగస్టు 28:(ప్రజాగళం) తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేసిన విషయం తెలిసిందే. పరకాల సీటు విషయంలో ఆమె చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం రేపాయి. ఈ క్రమంలో కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేస్తారంటూ వార్తలు వస్తున్నాయి. ఇలాంటి సమయంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. రాఖీ పండుగ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి కొండా సురేఖ వెళ్లారు. రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన సురేఖ.. కొద్దిసేపు ఇటీవల జరిగిన అంశాలపై చర్చించినట్లు తెలిసింది.సీఎం రేవంత్ రెడ్డికి గతేడాది కూడా మంత్రి కొండా సురేఖ రాఖీ కట్టారు. గతేడాది కుమార్తె సుస్మిత పటేల్ తో కలిసి రేవంత్ నివాసానికి వెళ్లి రాఖీ కట్టారు. అయితే, ఈసారి మంత్రి సీతక్కతో కలిసి కొండా సురేఖ రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. ఇటీవల సుస్మిత పటేల్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేసిన నేపథ్యంలో కొండా సురేఖ మాత్రమే ఈసారి రేవంత్ నివాసానికి వెళ్లారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టే సమయంలో ఆయన కుటుంబ సభ్యులు ఉన్నారుఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కడుతున్నా. ప్రత్యేకంగా బంగారు రాఖీ చేయించి సీఎంకు కట్టా.. నేను అందరికీ ఆడపడచునే అని అన్నారు. ప్రస్తుతం రాజకీయాలు నేను మాట్లాడను. సీఎం రేవంత్ రెడ్డి మంచి పాలన అందించాలని కోరుకుంటున్నానని అన్నారు. పరకాల నియోజకవర్గం సీటు విషయంలో సుస్మిత పటేల్ సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు కొండా సురేఖ ఫ్యామిలీని రాజకీయంగా ఇరకాటంలోకి నెట్టాయి. దీంతో తన కుమార్తె వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. నేరుగా సీఎం రేవంత్ రెడ్డిపైనే సుస్మిత పటేల్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడం, ఆ వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని కొండా సురేఖ అనడంతో ఈ అంశం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చనీయాంశమైంది. కాంగ్రెస్‌లోని కొందరు ఎమ్మెల్యేలు మీడియా సమావేశం ఏర్పాటు చేసి కొండా సురేఖపై పార్టీ అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, ఆమెను మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఆ తరువాత.. కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను కలిశారు. మరోవైపు కొండా మురళి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన కుమార్తె వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర పార్టీలో జరుగుతున్న తాజా అంశాలపై, వివాదాలపై పీసీసీ నివేదికలు హైకమాండ్‌కు చేరినట్లు తెలిసింది. మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించడం ఖాయమని, అసెంబ్లీ సమావేశాలలోపే సంక్షోభాన్ని పరిష్కరించి, ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం లేకుండా చేయాలని కాంగ్రెస్ హైకమాండ్ యోచిస్తోందని సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో రాఖీ పండుగ సందర్భంగా కొండా సురేఖ సీఎం నివాసానికి వెళ్లి సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో కొండా ఫ్యామిలీ వివాదానికి తెరపడినట్లేనా అనే చర్చ జరుగుతుంది.





## యువత ఉరకలెత్తాలి.. భారత్ వికసించాలి

**- మెడ్చల్--మల్కాజిగిరిలో ఖేలో ఇండియా డైలాగ్**

**ప్రధానమంత్రి మోదీ సందేశాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన విద్యార్థులు**

**- క్రీడలు.. ఫిట్‌నెస్.. క్రమశిక్షణే విజయానికి సోపానాలు**

**మాదకద్రవ్యాలకు దూరంగా ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలి**

**వికసిత భారత్**

**-2047 నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి**

కుత్బుల్లాపూర్, ఆగస్టు 28:(ప్రజాగళం): క్రీడా స్ఫూర్తితో యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చడమే లక్ష్యంగా 'ఖేలో ఇండియా డైలాగ్--ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్' కార్యక్రమాన్ని మెడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మై భారత్, కేంద్ర యువజన వ్యవహారాలు--క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని రెండు విద్యాసంస్థల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా యువ క్రీడాకారులు, విద్యార్థులతో నిర్వహించిన ప్రత్యక్ష వర్చువల్ కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించారు. క్రీడలు కేవలం పతకాలు సాధించేందుకు మాత్రమే కాకుండా యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, పట్టుదల, జట్టు స్ఫూర్తిని పెంపొందించే సాధనాలుగా నిలుస్తాయని కార్యక్రమం ద్వారా సందేశం అందింది. కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సైక్లింగ్ క్రీడాకారుడు జి. సాయి చరణ్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. క్రీడల్లో రాణించేందుకు క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదల ఎంతో అవసరమని పేర్కొంటూ యువతకు స్ఫూర్తినిచ్చారు. క్రీడా రంగంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రతిరోజూ సాధన చేస్తే ప్రతిభను విజయంగా మలుచుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. చందన, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. నాగుల వేణు, డా. డి. పద్మ, డా. ఎ. గోపాల్ పాల్గొన్నారు.మెడ్చల్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి సైక్లిస్ట్ అల్లాడి సాయి శ్రేయస్, కోచ్ అల్లాడి కృష్ణ, స్విమ్మర్లు విష్ణు వర్ధన్, వర్షిత్ ధులిపూడి, అభయ్ లక్కోజు, సచిన్ సాత్విక్, కశిష్ శ్రీవాస్తవ పాల్గొని విద్యార్థులకు క్రీడలపై అవగాహన కల్పించారు. క్రీడా రంగంలో అవకాశాలు, సాధన, క్రమశిక్షణ తదితర అంశాలపై విద్యార్థులతో వారు ముచ్చటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. రాధ, పి.వి. నాగలక్ష్మి, ప్రతిభ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఇ. నాగలక్ష్మి పాల్గొన్నారు. మై భారత్ ప్రతినిధులు కిరణ్‌కుమార్ కందుకూరి, ఎ. హర్షిత రెడ్డి, ఇ. వికాస్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని స్వచ్ఛంద సేవ, నాయకత్వం, అనుభవాధారిత అభ్యాసం, దేశ నిర్మాణానికి సంబంధించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్--2027లో యువత చురుగ్గా పాల్గొని తమ ఆలోచనలు, ప్రతిభ, సృజనాత్మకతను దేశ అభివృద్ధికి వినియోగించాలని పిలుపునిచ్చారు.క్రీడలు, ఫిట్‌నెస్, క్రమశిక్షణతో పాటు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే ఆరోగ్యకర జీవనశైలిని యువత అలవర్చుకోవాల్సిన అవసరాన్ని కార్యక్రమంలో వివరించారు. యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే దేశ భవిష్యత్తు మరింత బలోపేతమవుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.మై భారత్ మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి స్నేహల్ ద్యానేశ్వర్ బసుట్కర్ మాట్లాడుతూ యువత క్రీడలు, ఫిట్‌నెస్‌ను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. మై భారత్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తమ ప్రతిభ, ఆలోచనలు, శక్తిని దేశ నిర్మాణానికి వినియోగించాలని పిలుపునిచ్చారు. వికసిత భారత్--2047 లక్ష్య సాధనలో యువత కీలక భాగస్వాములుగా మారాలని ఆమె ఆకాంక్షించారు. క్రీడా మైదానాల నుంచి దేశ నిర్మాణం వరకు యువత ముందుండాలని సూచించారు.

# వినూత్నంగా రక్షాబంధన్ వేడుక.. గొప్ప సందేశం ఇచ్చిన విద్యార్థులు!

ఆదిలాబాద్,ఆగస్టు 28:(ప్రజాగళం) నీడ నిచ్చి గూడు నిచ్చి ప్రాణవాయువునిచ్చి ప్రాణాలు కాపాడుతున్న వృక్షాలకు మేమంతా రక్షా అంటున్నారు విద్యార్థులు. తోడబుట్టిన అన్నదమ్ముల్ల రక్ష కోసం కట్టే రాఖీబందన్ వేళ వృక్షో రక్షతి రక్షిఃత అంటూ చెట్టు చెట్టుకు ప్రకృతి మయమైన రాఖీలను కట్టి భళా అనిపిం చుకున్నారు అక్కడి విద్యార్థులు. విద్యార్థులే కాదు ప్రకృతి ప్రేమికులు, అటవిశాఖ అధికారులు అంతా కలిసి వృక్షా బందన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రక్షాబందన్ వేళ వృక్షా బందనం కూడా అంటున్న ఉమ్మడి ఆదిలాబాద్ పై స్పెషల్ రిపోర్ట్రాఖీ పౌర్ణమి వచ్చిందంటే చాలు తోడబుట్టిన అక్కా చెల్లిల్లు ఆనందగా అన్న దమ్ముల్లకు రాఖీలు కడుతూ మురిసిపోతారు. ఆ బంధం అంత బలమైనది. ఉమ్మడి ఆదిలాబాద్ లో మాత్రం ఈ బందం జన్మ జన్మలది అంటున్నారు అక్కడి విద్యార్థులు. నిర్మల్ జిల్లా జామ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వృక్షాలను రక్షిద్దాం అంటూ వృక్ష రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వృక్షాలకు రాఖీలు కట్టి చెట్లతో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం జామ్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు ఈరోజు తమ పాఠశాల ఆవరణలోని చెట్లకు రాఖీలు కట్టారు. అటవీ సంరక్షణ అధికారి నజీర్ ఖాన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు పర్యావరణహితంగా



కదంబ ఫలానికి తాటి నార ను ఉపయోగించి ప్రత్యేక రాఖీలను తయారు చేశారు. అనంతరం సామూహికంగా పాఠశాల ఆవరణలోని ప్రతి ఒక్క చెట్టుకు రాఖీలను కట్టారు. సదరు చెట్లను కాపాడుకుంటాం అని తెలిపారు. అటు ప్రకృతి మిత్ర ఆధ్వర్యంలో వృక్ష రక్షాబంధన్ కార్యక్రమాన్ని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రామ్ చెరువు పార్కులో ఘనంగా నిర్వహించారు. ప్రకృతి ప్రేమికులు, ఫారెస్ట్ అధికారులు చెట్లకు రాఖీలు కట్టి వాటిని తమ సొంత కుటుంబ సభ్యుల్లా కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, చెట్ల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, చెట్లు మనకు ప్రాణవాయువు, నీడతో పాటు పర్యావరణ సమతుల్యతను అందిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని, వృక్షాలను కాపాడటమే మన భవిష్యత్తును కాపాడటమని, భావితరాలకు పచ్చని వాతావరణాన్ని అందించేందుకు అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రతికూల ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

మహబూబ్‌నగర్ : జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులకు పంటల సాగుపై నిరంతరం అవగాహన కల్పిస్తూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సరైన సూచనలు, సలహాలు అందించాలని అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ నుంచి వ్యవసాయ శాఖ అధికారులతో ఎల్‌నినో పరిస్థితులు, వాతావరణ మార్పులు, వర్షపాతం, పంటల సాగు, పంటల ప్రస్తుత పరిస్థితి తదితర అంశాలపై అదనపు కలెక్టర్ వెబెక్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, ఇప్పటివరకు నమోదైన వర్షపాతం, మండలాల వారీగా వివిధ పంటల సాగు, పంటల ప్రస్తుత పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తదితర వ్యవసాయ ఇన్‌పుట్‌ల లభ్యత, సరఫరా పరిస్థితిపై కూడా సమీక్షించారు.



ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించే అవకాశం ఉన్నందున పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని మధుసూదన్ నాయక్ సూచించారు. మండలాల వారీగా పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి, రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, సలహాలను సకాలంలో అందించాలని ఆదేశించారు. వాతావరణ మార్పులు, వాటి ప్రభావాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించాలని అన్నారు. ఎల్‌నినో ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతుల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని, అవసరమైన సాంకేతిక సహకారం అందించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్‌లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సంరక్షణకు అవసరమైన చర్యలను చేపట్టాలని ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా వ్యవసాయ కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం పడకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద నాయక్, మండల వ్యవసాయ అధికారులు , వ్యవసాయ విస్తరణ అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

## పండుగ వేళ ఆర్టీసీ దోపిడీ

- ఉదయం రూ.60.. మధ్యాహ్నానికి రూ.80
- పల్లె వెలుగుకి ఎక్స్ ప్రెస్ బోర్డు
- ప్రయాణికుల జేబుకు చిల్లు!

ఉమ్మడి పాలమూరు ఆగస్టు 28:(ప్రజాగళం): రాఖీ పండుగ వేళ ఆర్టీసీ అధికారుల తీరుపై ప్రయాణికులు మండిపడుతున్నారు. నాగర్ కర్నూల్-మహబూబ్ నగర్ పల్లె వెలుగు బస్సులో అకస్మాత్తుగా చార్జీలు పెంచడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఉదయం రూ.60 ఉన్న చార్జీని మధ్యాహ్నానికి ఏకంగా రూ.80 కి పెంచారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పండుగ రోజున ముందస్తు సమాచారం లేకుండా ఇలా చార్జీలు పెంచడం దారుణమని మండిపడుతున్నారు.

విద్యార్థుల కష్టాలు:

చార్జీలు సరిపోక హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదనపు చార్జీ చెల్లించలేక కొంతమంది విద్యార్థులు మార్గమధ్యలోనే బస్సు దిగి నడుచుకుంటూ వెళ్లిన పరిస్థితి నెలకొంది.

పల్లె వెలుగు ఆర్డినరీ బస్సులకు ఎక్స్ ప్రెస్ బోర్డులు తగిలించి ఎక్స్ ప్రెస్ చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని, నాగర్ కర్నూల్ డిపోపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# జీవో నంబర్ 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి

అక్కన్నపేట, ఆగస్టు 28:(ప్రజాగళం) పాలిటెక్నిక్ విద్యార్థులు గత పది రోజులుగా జీవో నంబర్ 97ను రద్దు చేయాలని కోరుతూ ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ పార్టీ అక్కన్నపేట మండల నాయకుడు, మాజీ ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్ అన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు వ్యతిరేకిస్తున్న జీవో 97పై ప్రభుత్వం వెంటనే పునరాలోచించాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యపై అధ్యయనం కోసం ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసి రోజులు గడుపుతున్నా విద్యార్థుల సమస్యకు పరిష్కారం చూపడం లేదన్నారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే పాలిటెక్నిక్ విద్యను అందులో విలీనం చేయడం వల్ల విద్యార్థులకు నష్టం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

గతంలో పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఇంజినీరింగ్‌లో రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందే అవకాశం ఉండేదని, జీవో 97తో ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందేందుకు పరీక్ష రాయాల్సిన నిబంధనలు తీసుకువస్తున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలనే నిర్ణయంపై విద్యార్థులు, అధ్యాపకుల్లో ఆందోళన నెలకొందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోకుండా, పాలిటెక్నిక్ విద్యను స్వతంత్రంగా కొనసాగించాలని కోరారు.

ఇప్పటికైనా ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనను అర్థం చేసుకుని జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని లింగాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, గణేష్ రెడ్డి, పల్లె నరసయ్యతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com